# ఆనంద గార్డెన్స్

పగలు పన్నెండు గంటలయింది. విద్యాలయం మేడమీద క్లాసు తీసుకుని దిగి వస్తున్నాను. ఒక జట్కాబండి రంయిమని వచ్చి విద్యాలయం ముందు ఆగింది. బండిలో ముగ్గురు, నలుగురు ఉన్నట్టనిపించింది. బండిలో నుంచి ఒక యువకుడు కిందికి దిగి హాలులోకి వచ్చి, సుబ్బమ్మగారి విద్యాలయం ఇదేనా? అని అడుగుతూండగా సుబ్బమ్మగారు లోపలి నుంచి వచ్చి ఎందుకు? ఏమికావాలి, అని అడిగారు. ఆ యువకుడు ఆమెను చూచి తటపటాయించాడు.

సుబ్బమ్మగారు ఎప్పుడూ తెల్లని శుద్ధ ఖద్దరు వస్త్రం కట్టుకుని, వైదిక బ్రాహ్మణ వితంతువేషంలో ఉండడం మామూలు. అప్పుడప్పుడు ముఖాన విభూతి రేఖలుకూడా ఉండడం కద్దు. ఆవిణ్ణిచూచి అతడు ఎందుకు సందేహిస్తున్నాడో తెలియలేదు. కొంత సేపటికి తేరుకుని అన్నాడు. "మేము ఒక వితంతు వివాహం జరుపుకుందామని వచ్చాం. మేము యిక్కడ ఎవరిని ఎరగం. సుబ్బమ్మగారి పేరు బాగా విన్నాం. వారు ఈ విషయంలో ఏమైనా సహాయం చేస్తారేమో అని వచ్చాం." అప్పుడామె అంతా విని ఇది విద్యాలయం, 'విడో హోము' కాదు. వీరేశలింగతోటలోకి వెళ్ళితే మీరు కావలసినవారు దొరుకుతారు. ఇక్కడ ఎవ్వరూ లేరు. అని లోపలికి వెళ్ళిపోతూ ఉండగా, నేను చట్టున అందుకుని 'నేను మీకు కావలసిన సహాయం చేస్తాను. వీరేశలింగం తోటకు నడవండి' అని అతని దగ్గరకు వచ్చాను. సుబ్బమ్మగారు, తక్కిన ఉపాధ్యాయులూ ఆశ్చర్యపడ్డారు. ఆమె ఇష్టానిష్టాలు వారికి బాగాతెలుసు. ఆమె ఎదుటనే, ఆమె ఉపేక్ష వహించిన విషయంలో ఇంతగా తెగిస్తానని వారనుకొని ఉండరు. నేను ఎవరివైపు చూడలేదు. ఆ వచ్చినాయనతో బండి దగ్గరకు వెళ్ళాను. బండిలో ఇంకో ఇద్దరు మగవాళ్ళు ఒక యువతి ఉన్నారు.

వారు పరమాప్తునకుమల్లె నన్ను చూచి బండిలో చోటు చేశారు. పరఖాయించి చూచాను. ఎక్కడినుంచో ఎవరినో తీసుకువచ్చిన అలగా జనంలాలేరు. పట్టుపట్టి ఒక పనిని నెరవేర్చుకుందామని వచ్చిన మధ్యతరగతి మనుష్యుల్లా ఉన్నారు.

యువతి రవివర్మదమయింతిలా ఉంది. 30 ఏళ్ళు ఉండవచ్చు. తల నిండా ప్రయాణపు ధూళి.

కళ్ళలో ఆరిపోయిన ఆశలు వెలిగే సూచనలు, చూచిన వారికి

'ఉలుకు' రాకుండా, ఉదారభావం కలిగించేలా ఉంది. ఒకసారి తలయెత్తి చూచి మళ్ళా ఒదిగి కూర్చుంది.

బండి వీరేశలింగంతోటలో వితంతు శరణాలయం ముందు ఆగింది. నేను దిగి వెళ్ళి శరణాలయపు ఉద్యోగి కాశీపతిగారిని పిలిచి సంగతంతా చెప్పాను.

కాశీపతిగారు బండిలో వారిని దిగమని "మీరు వచ్చినపని విన్నాను. చట్టరీత్యా చిక్కులేమీ లేకపోతే మీ వివాహం జరిపించడానికి ఏమీ అభ్యం తరంలేదు. నేటికి మూడవరోజున వివాహానికి అన్ని ఏర్పాట్లూ చేస్తాం. అమ్మాయి ఈ శరణాలయంలో ఉండవచ్చు. మగవారు మాత్రం ఈ మూడురోజులూ ఊళ్ళో ఉండి ఆనాటికిరావాలి. మీరు హిందూపద్ధతిగా వివా హము జరగాలని కోరితే పురోహితుడికి కబురు చేస్తాం. బ్రహ్మ సమాజం పద్ధతిగా కోరితే అట్లా చేస్తాం" అన్నారు. ఆ వచ్చిన వారికి ఈ పద్ధతులేమీ తెలియవు. పెండ్లిమాత్రం కావాలి, అంతే. వారు దిక్కులు చూస్తూ ఊరు కుంటే, నేను అందుకుని, కాశీపతిగారూ వారికి హిందూ పద్ధతిగానే కాని వ్వండి ! అన్నాను. అమ్మాయి నవ్వింది. తక్కినవారు అమ్మయ్యా బతి కించారు, అనుకున్నారు. కాశీపతిగారు నిర్వికారంగా లోపలికి వెళ్ళి పోయారు.

ఆ వచ్చినవారు నన్ను చుట్టి 'ఎల్లుండి' మాకు మీరే బంధువు లన్నారు. పెళ్ళికి తప్పకుండా రావాలన్నారు. అమ్మాయి మౌనంగా నల్లని కళ్ళతో తన కృతజ్ఞతతెలిపింది. నేను జీవితంలోచేసినతొలిసత్కార్యం అదే అన్నట్టు గర్వపడ్డాను.

ఆ మూడోరోజు_ ఆ రోజున మూడు గంటలకు పెండ్లి అని కబురు వచ్చింది.

జానకిరామయ్య తూర్పుగోదావరి జిల్లా కమ్మవారబ్బాయి హుకుంపేటలో చుట్టాలింటిదగ్గర ఉండి వీరేశలింగం హైస్కూల్లో నాలుగో ఫారం చదువుతున్నాడు. అతని చెల్లెలు విద్యాలయంలో చదువుతూ ఉండడంవల్ల అప్పుడప్పుడు విద్యాలయానికి వస్తూండేవాడు. మంచి మరుకయినవాడు సంస్కారభావాలు కలవాడు. అతని అన్నగారు వితంతు వివాహం చేసుకున్నాడట.

నేను 'ఆనందగార్డెన్సు'కు బయలుదేరుతూ ఉండగా అతడు నా వెంట వచ్చాడు. శరణాలయం దగ్గర పెండ్లి సరంజామా అంతా సిద్ధం అయింది. పెండ్లి కుమారుడు పీటమీద కూర్చున్నాడు. భవిష్యత్తులో ఒక యుద్ధానికి సిద్ధమవుతున్న యోధుడులా ఉన్నాడుగాని జీవన మాధుర్యాన్ని చవిగొనబోయే చిన్నవాడుగా కనబడలేదు. 40 ఏళ్ళుంటాయి. నిండుగా ఉన్నాడు. శరణాలయ వితంతు కన్యలందరూ ముందు జరగబోయే తమ శుభదినానికి ఇది ఒక 'రిహార్సల్' అయినట్లు హుషారుగా ముందు శ్రేణిలో కూర్చున్నారు. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. ఊళ్ళో వీరేశలింగం గారికి శిష్యులు, ఆయన ఉద్యమ ప్రచారకులు పెండ్లికి విచ్చేశారు. అందులో ముఖ్యులు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు. ఆయన చతురోక్తులు పలుకుతూ సభ్యులను నవ్విస్తున్నారు. ఇంతలో పెండ్లికూతురును ఇద్దరు చెలిమికత్తెలు తీసుకొనివచ్చి పెండ్లికొడుకు పక్క కూర్చోబెట్టారు. ఆమె సిగ్గుపడుతూ కూర్చుంది. జడనిండా తురుముకున్న పూలకన్న, కట్టుకున్న తెలిపట్టుచీర కన్న, ఆ సిగ్గు అందంగా ఉంది.

పెండ్లి అయిపోయింది. వీడ్కోలు చెప్పి తిరిగి వస్తూ వీరేశలింగ దంపతుల సమాధులకు దగ్గరగా ఉన్న మండపం చెంతకు చేరాం. జానకిరామయ్య మండపం అంచుమీద చెయ్యివేసి, గురువుగారూ ఎప్పటికైనా ఈ మండపం ఎక్కాలి మనిద్దరం అన్నాడునవ్వుతూ. నవ్వే మిగిలింది. ●